పద్మ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర హోంశాఖ ఆధ్వర్యాన పద్మ అవార్డులకు నామినేషన్లను కోరుతున్నట్లు సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజిక, సాంఘిక సేవ, ప్రజా సంబంధాలు, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం, పాండిత్యం, విద్య, సివిల్ సర్వీసెస్, క్రీడలు, ఇతర రంగాల్లో ఉత్తమ సేవ కనబరిచిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల పదో తేదీ లోగా దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని హార్డు కాపీలను సెట్‌శ్రీ కార్యాలయం, శ్రీకాకుళంకు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు కార్యాలయ మేనేజర్ వి.వి అప్పలనాయుడు 9441899549 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వజ్రపుకొత్తూరు మండలం కొత్తపేట వద్ద అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు

లక్ష్యం చేరుకునేనా..?

- ఈనెల 31 నాటికి 35,195 ఇళ్లు పూర్తి లక్ష్యం
- ఇప్పటివరకు 27,704 గృహాలు పూర్తి
- అరకొరగా మౌలిక వసతులు

జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం పలుమార్లు ప్రయత్నించినా నెరవేరలేదు. గృహ ప్రవేశాలకు తేదీలను నిర్ణయించినా, చివరి క్షణంలో రకరకాల కారణాలతో వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. 2022లో విజయదశమి రోజున నిర్వహిస్తామని ఒకసారి, ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు అయిన డిసెంబర్ 21న చేపడతామని మరోసారి ప్రకటించి జరపకుండా అభాసుపాలైంది. గృహ నిర్మాణాల లక్ష్యం కనీసం 50 శాతం కూడా దాటకపోవడమే ఇందుకు ముఖ్య కారణం. ఇళ్ల ప్రవేశాలకు తేదీని నిర్ణయించకుండా ఈనెల 31వ తేదీ నాటికి జిల్లాకు ఇచ్చిన లక్ష్యం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఇళ్ల నిర్మాణం జరిగిన చోట్ల మౌలిక వసతులు మాత్రం ఆ స్థాయిలో జరగలేదు. సొంత లేఅవుట్లలో విద్యుత్, మంచినీటి కనెక్షన్లు కొంతవరకు ఇస్తున్నా, కాలనీల్లో నామమాత్రంగా ఉంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా జిల్లాకు 74,811 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 35,195 ఇళ్లను పూర్తిస్థాయిలో ఈనెల 31వ తేదీ నాటికి సిద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇళ్ల నిర్మాణాలతో పాటు ఇళ్లకు విద్యుత్, తాగునీటి సరఫరా కల్పించాలని సూచించింది. ఇందులో ఇప్పటివరకు 27,704 ఇళ్లు (84.69 శాతం) పూర్తయ్యాయి. మరో 7,491 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తే, ఆమదాలవలస అర్బన్‌లో అత్యధిక నిర్మాణాలు పూర్తయ్యాయి. అర్బన్ ప్రాంతానికి 753 ఇళ్లను లక్ష్యంగా నిర్దేశించగా 710 ఇళ్లు (94.29 శాతం) పూర్తయ్యాయి. ఆమదాలవలస మండలంలో 862 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 800 (92.81 శాతం) గృహాలను నిర్మించారు. సరుబుజ్జిలి మండలానికి 832 ఇళ్లను కేటాయించగా, 668 గృహాలను (91.26 శాతం) పూర్తి చేశారు. ఇచ్ఛాపురం అర్బన్ ప్రాంతానికి 925 గృహ్హాలను కేటాయించగా 841 ఇళ్లను (90.92 శాతం) నిర్మించారు. పోలాకి మండలంలో 1320 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా 1174 గృహాల నిర్మాణం (88.94 శాతం) జరిగింది. లావేరు మండలానికి 1875 ఇళ్లు లక్ష్యంగా నిర్దేశించగా 1643 ఇళ్లు (87.63 శాతం) పూర్తయ్యాయి. పలాస మండలంలో 808 ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 698 గృహాలను (86.39 శాతం) పూర్తి చేశారు. పొందూరు మండలానికి 975 ఇళ్లు లక్ష్యం కాగా 842 ఇళ్లు (86.36 శాతం) నిర్మించారు.

ఆరు మండలాల్లో నిర్మాణాలు 50 శాతం లోపే!

జిల్లాలో ఆరు మండలాల్లో 50 శాతం ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తి కాలేదు. వాటిలో మెళియాపుట్టి, కొత్తూరు, పాతపట్నం, హిరమండలం, సారవకోట, శ్రీకాకుళం అర్బన్ ప్రాంతాలు ఉన్నాయి. మెళియాపుట్టి మండలానికి 142 ఇళ్లను కేటాయించగా, ఇప్పటివరకు 26 ఇళ్లు (18.31 శాతం) మాత్రమే పూర్తయ్యాయి. కొత్తూరు మండలంలో 143 ఇళ్లను నిర్మించాల్సి ఉండగా 31 ఇళ్లను (21.68 శాతం) పూర్తి చేశారు. పాతపట్నం మండలంలో 87 ఇళ్లు కేటాయించగా 26 గృహాలను (29.89 శాతం) పూర్తి చేశారు. సారవకోట మండలానికి 53 ఇళ్లను లక్ష్యంగా నిర్దేశించగా 18 గృహాలు (33.33 శాతం) పూర్తయ్యాయి. శ్రీకాకుళం అర్బన్ ప్రాంతానికి 2,968 ఇళ్లను లక్ష్యంగా నిర్ధేశించగా 1289 ఇళ్లు (43.43 శాతం) పూర్తయ్యాయి.

లేఅవుట్లలో నామమాత్రంగా విద్యుత్ కనెక్షన్లు

జగన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పనలోనూ వెనుకబాటు కనిపిస్తోంది. ప్రధానంగా తాగునీరు, విద్యుత్, రహదారుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటివరకు 27,704 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిలో సొంత స్థలాల్లో ఇళ్లనిర్మించుకుంటున్న వారు 22,911 మంది, జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారు 4,793 మంది ఉన్నారు. వీటిలో ఇప్పటివరకు 23,690 ఇళ్లకు (85.51 శాతం) విద్యుత్ సరఫరాను అందించగలిగారు. ఇందులో సొంత స్థలాల్లో నిర్మాణం చేపడుతున్న 21,370 ఇళ్లకు, లేఅవుట్లలో ఉన్న 2,320 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లను ఇచ్చారు. కవిటిలో ఐదు ఇళ్లకు, ఇచ్ఛాపురం అర్బన్‌లో ఏడు, మందసలో తొమ్మిది ఇళ్లకు మాత్రమే విద్యుత్ సరఫరాను అందించగలిగారు.

తాగునీటి సౌకర్యమూ అంతంతమాత్రమే

ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు అంతంతమాత్రంగానే తాగునీటి సౌకర్యం అందించారు. జిల్లాలో 27,704 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, 23,463 ఇళ్లకు (84.69 శాతం) తాగునీటి కనెక్షన్లు ఇచ్చారు. వీటిలో లేఅవుట్లలో కేవలం 2,115 ఇళ్లకు మాత్రమే తాగునీటిని అందించగలిగారు. మిగిలిన 21,348 కనెక్షన్లు సొంతంగా ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇచ్చారు. నరసన్నపేటలో ఐదు ఇళ్లకు, ఇచ్ఛాపురం అర్బన్‌లో ఎనిమిది, మందసలో తొమ్మిది, ఆమదాలవలస అర్బన్‌లో పది ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇచ్చారు.

పోలాకి : సముద్ర తీరానికి కొట్టుకొచ్చిన బోటు

మృత్యు కెరటాలు

- రెండు పడవలు బోల్తా
- ఇద్దరు మత్స్యకారులు మృతి
- ఒకరు గల్లంతు
- బందరువానిపేట, కపాసుకుద్దిలో విషాదఛాయలు

ఢిల్లేశు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు

నడి సంద్రంలో అలలకు ఎదురీది ఇన్ని రోజులు కుటుంబాన్ని పోషించుకుంటున్న వారికి సముద్రపు కెరటాలే మృత్యు కెరటాలుగా మారాయి. ఇన్ని రోజులు ఉపాధి కల్పించిన ఆ కడలి ఒడిలోనే ఊపిరి వదలడంతో తీరం కన్నీటిసంద్రంగా మారింది. గార మండలం బందరువానిపేట, కవిటి మండలం కపాసుకుద్దిలో పడవలు బోల్తా పడిన ఘటనలో బందరువానిపేటకు చెందిన పుక్కళ్ల లక్ష్మయ్య (53), కపాసుకుద్దికి చెందిన బడే ఢిల్లేసు (42) ఆదివారం మృతి చెందారు. ఒకరు గల్లంతు కాగా, నలుగురు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటనతో బందరువానిపేట, కపాసుకుద్దిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఒడ్డుకు చేరిన లక్ష్మయ్య మృతదేహం

ప్రజాశక్తి - కవిటి, గార, సంతబొమ్మాళి, పోలాకి

గార మండలం బందరువానిపేటకు చెందిన సుకల సూర్యనారాయణ, గుంటు తలసయ్య, దుమ్ము కన్నయ్య, చోడిపిల్లి సూరిబాబు, గుంటు గణపతిరావు, పుక్కళ్ల లక్ష్మయ్య ఒకే బోటులో సముద్రంలో చేపల వేటకు బయలుదేరారు. రాకాసి అలల ఉధృతికి బోటు బోల్తా పడడంతో ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. వీరిలో సుకల సూర్యనారాయణ, గుంటు తులసయ్య, దుమ్ము కన్నయ్య, చోడిపిల్లి సూరిబాబు ఈదుకుంటూ పోలాకి మండలం రాజారాంపురం వద్ద ఒడ్డుకు చేరుకున్నారు. కొంతసేపటి తర్వాత వారు వేటకు వెళ్లిన బోటు కూడా అక్కడే ఒడ్డుకు చేరుకుంది. బోటును పోలాకి ఎఎస్ఐ జగన్నాథం, మెరైన్ పోలీసులు పరిశీలించారు. సంతబొమ్మాళి మండలం చెరువుగట్టుపేట, పిట్టవానిపేట తీరం మధ్య పుక్కళ్ల లక్ష్మయ్య మృతదేహం ఒడ్డుకు చేరింది. విషయం తెలుసుకున్న సంతబొమ్మాళి తహశీల్దార్ జల్లి రామారావు, ఎస్ఐ కె.మధుసూదనరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య కృష్ణవేణి, కుమారుడు శ్రీరాములు, కుమార్తెలు ఎల్లమ్మ, రాజేశ్వరి ఉన్నారు. గల్లంతైన గణపతిరావు కోసం గాలిస్తున్నారు. గణపతిరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు కోనాడ నర్సింగరావు గాలింపు చర్యలను పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు.

కవిటి మండలం కపాసుకుద్దికి చెందిన బడే ఢిల్లేశు, మైలపల్లి శ్యామ్ శేఖర్, మైలపల్లి శివ, బుడ్డ వీరయ్య, సూరాడ పేరయ్య పడవలో ఆదివారం వేకువజామున చేపల వేటకు బయలుదేరారు. సముద్రంలో కొంతదూరం వెళ్లేసరికి అలల ఉదతికి బోల్తా పడింది. దీంతో పడవలో ఉన్న ఐదుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతయ్యారు. పడవ బోల్తా పడిన సమయంలో ఢిల్లేశు అలల సుడిగుండంలో చిక్కుకున్నాడు. ప్రాణం దక్కించుకునేందుకు చివరి వరకు అలలతో పోరాడి ఒడ్డుకు చేరాడు. అప్పటికే అతని కడుపులోకి పూర్తిగా ఉప్పునీరు చేరడం, శ్వాస అందకపోవడంతో కడలి ఒడిలో తనువు చాలించాడు. మైలపల్లి శివ కూడా అలలను దాటుకుంటూ ఒడ్డుకు చేరుకునేందుకు తీవ్రంగా శ్రమించాడు. ఒడ్డుకు చేరే సమయానికి కొంత అస్వస్థత గురయ్యాడు. కొంతసేపటికి తేరుకుని తన సహచరుల కోసం వెతికేసరికి ఢిల్లేశు విగతజీవిగా కనిపించాడు. మిగతా ముగ్గురు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటనతో కడలి తీరం కన్నీటి సంద్రంగా మారింది. మృతునికి భార్య తిరుపతమ్మ, కుమారుడు బాలు, కుమార్తె అంజలి ఉన్నారు. ఢిల్లేశు భార్య తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కవిటి ఎస్ఐ కె.రాము కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మృతుడు లక్ష్మయ్య (ఫైల్)

గల్లంతైన గణపతిరావు (ఫైల్ ఫొటో)

బాధిత కుటుంబాలను పరామర్శించిన లక్ష్మీదేవి

బందరువానిపేటలో పడవ బోల్తా పడిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి గల్లంతైన వారి కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులకు మెరుగైన వైద్యం కోసం ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు పొట్నూరు కృష్ణ, జల్లు రాజీవ్, ఎన్ని గోపి తదితరులున్నారు.

117 జిఒతో విద్యారంగానికి చేటు

- తక్షణమే రద్దు చేయాలి
- సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటాలు
- ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ కె.భానుమూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒ విద్యారంగానికి చేటు చేస్తుందని, తక్షణమే ఆ జిఒను రద్దు చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ కె.భానుమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులపై అనుచిత రీతిలో ప్రవర్తిస్తూ వేధింపులకు గురిచేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తన తీరును మార్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులపై అనుసరిస్తున్న వైఖరిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ పాఠశాల విద్యలో సిలబస్‌ను ప్రభుత్వాలు ఇష్టం వచ్చినట్టు మార్చడం సరికాదన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియ వల్ల ప్రాథమిక పాఠశాలలు వాటి ఉనికిని కోల్పోతున్నాయని చెప్పారు. విద్యారంగంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాల వల్ల ఉద్యోగ భద్రత లేకుండా పోతుందన్నారు. వీటన్నింటినీ ఎదుర్కొని పోరాటాలకు ఉపాధ్యాయులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షులు, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల కామన్ సీనియారిటీ సమస్యను పరిష్కరించకుండా గందరగోళపరిచే విధంగా ప్రమోషన్లు కల్పించడం సరికాదన్నారు. ఫ్యాప్టో జిల్లా సెక్రటరీ జనరల్ కె.అప్పలరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో చేపట్టనున్న దశల వారీ పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళ్లిపోయే విధంగా ప్రభుత్వ విధానాలు ఉంటున్నాయని విమర్శించారు. 12వ పిఆర్‌సి కోసం చెప్తున్న ప్రభుత్వ పెద్దలు 11వ పిఆర్‌సి బకాయిలు నేటికీ చెల్లించలేదన్న విషయాన్ని గుర్తుచేశారు. ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ మాట్లాడుతూ సింగిల్ టీచర్ పాఠశాలల వల్ల డ్రాపౌట్స్ పెరుగుతాయన్నారు. సింగిల్ టీచర్ పాఠశాల, పాఠశాలల విలీనం వల్ల ప్రాథమిక విద్య కునారిల్లుతోందని విమర్శించారు. ఫ్యాప్టో జిల్లా కో చైర్మన్ పొందూరు అప్పారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేసే చర్యలు తగవన్నారు. బిటిఎ అధ్యక్షులు పి.రామారావు, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుభాష్‌బాబు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం పోరాటాల్లోనే ఉందని, భవిష్యత్ పోరాటాలకు ఉపాధ్యాయుల సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్, ఎపి సిపిఎస్ ఇఇ ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒపిఎస్ తప్ప ఇంకే విధానాన్నీ అంగీకరించబోమని స్పష్టం చేశారు. సదస్సులో డిటిఎఫ్ నాయకులు కోత ధర్మారావు, ఎస్, ఎస్‌టి టీచర్స్ యూనియన్ నాయకులు బి.రమేష్, ఎపిటిఎఫ్ (1938) నాయకులు బి.రవి, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ భానుమూర్తి

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

14 నుంచి టిడిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీకి జిల్లాలో పూర్వవైభవాన్ని తీసుకొచ్చేందుకు ఈనెల 14వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజా రక్షణ యాత్ర పేరిట బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ తెలిపారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఇతర ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించారు. బస్సు యాత్ర రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నాలుగేళ్ల కాలంలో వైసిపి దురాగతాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. దళితులు, బడుగు, బలహీన వర్గాలపై దాడులు, అవినీతి, అక్రమాలు, ఇసుక, మద్యం, మైనింగ్ దోపిడీ, భూదందాలు తదితర అంశాలపై ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ యాత్ర ఈనెల 14న పాతపట్నంలో ప్రారంభమవుతుందని, 15న పలాస, 16న ఇచ్ఛాపురం, 17న నరసన్నపేట, 18న శ్రీకాకుళం, 19న ఆమదాలవలస నియోజకవర్గాల్లో సాగుతుందని చెప్పారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, నియోజకవర్గా ఇన్‌ఛార్జీలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష, కలమట వెంకటరమణ, పార్టీ నాయకులు పి.ఎం.జె బాబు, బొనిగి భాస్కరరావు, కె.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన తైక్వాండో పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన తైక్వాండో క్రీడకు శ్రీకాకుళంలో ఇంతటి ఆదరణ పెరగడం గర్వంగా ఉందన్నారు. తైక్వాండో క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకుని కోచ్‌ల ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తైక్వాండో శ్రీను మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటిన క్యాడెట్ విభాగాలకు చెందిన బాలబాలికలు ఈనెల 15, 16వ తేదీల్లో విజయనగరం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్యాడెట్లకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను శ్రీకాకుళం టౌన్ హాల్ టీమ్ సొంతం చేసుకోగా, తర్వాత స్థానాలు టెక్కలి, నరసన్నపేట టీమ్‌లు దక్కించుకున్నాయి. జిల్లాస్థాయిలో సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ప్రతిభ కనబరచి మొదట మూడు స్థానాల్లో నిలిచిన బాలబాలికలకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు కొన్న వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది నౌపడ విజయకుమార్, నిర్వాహక ప్రతినిధులు ఎం.సుధీర్ వర్మ మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను, దళిత జెఎసి నాయకులు కంఠ వేణు, కె.రాంగోపాల్, పిఇటి పీడీ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి రమణ, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అరసవల్లికి పెరిగిన రద్దీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి ఆదివారం సందర్శకుల తాకిడి పెరిగింది. ఎస్‌పి జి.ఆర్ రాధిక కుటుంబసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. విశాఖపట్నం సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, ఇటీవల సివిల్స్‌లో ర్యాంకు సాధించిన చల్లా కళ్యాణి కుటుంబసభ్యులతో ఆలయాన్ని సందర్శించారు. అనకాపల్లి జిల్లా వి.మాడుగులకు చెందిన శ్రీనివాసరావు, పరమేశ్వరి దంపతులు ఆలయాన్ని సందర్శించి ఆలయ అభివృద్ధికి రూ.1,01,001, ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కులను ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్‌కు అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా మామిడిపల్లికి చెందిన ఎం.పద్మలత రూ.1,00,116 నిత్యాన్నదాన పథకానికి అందజేశారు. వారికి ఇఒ హరి సూర్యప్రకాష్ జ్ఞాపికలను అందజేశారు.

ఎస్‌పికి చిత్రపటానికి అందిస్తున్న ఇఒ హరి సూర్యప్రకాష్

ఆదిత్యుని ఆదాయం రూ.7.17లక్షలు

ఆదిత్యునికి ఆలయానికి ఆదివారం ఒక్కరోజే రూ.7.17 లక్షల ఆదాయం సమకూరినట్లు ఇఒ హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఆలయ ప్రవేశానికి, ఇతర సేవలకు విక్రయించిన టిక్కెట్ల ద్వారా రూ.3,58,200, విరాళాల రూపంలో రూ.1,23,933, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2,35,000 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి

ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్ : ప్రజలకు ఆరోగ్యపరంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్క రించడంలో తోడ్పాటు అందించేలా ప్రజారోగ్య వేదిక పనిచేస్తుందని వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు తెలిపారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ప్రజారోగ్య వేదిక జిల్లా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగం ప్రయివేటీకరణ కావడం వల్ల సామాన్యులకు వైద్యం ఖరీదుగా మారిందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచడం ద్వారా పేదలకు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు వీలవుతుందని చెప్పారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

సమావేశ అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా డి.వాసుదేవరావు, కార్యదర్శులుగా పొట్నూరు అప్పారావు, సాయిప్రసాద్, మురళి, ఎన్.వి లక్ష్మి, టి.విజయమోహన్, సత్యప్రవీణ్, శివశంకర్ ఎన్నికయ్యారు.

మహారాజశ్రీ సోంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సముఖమునకు
H.M.O.P. 77/2022

Borra Supraja .....Petitioner
And
Borra Hemanth Kumar ......Respondent
To
Borra Hemanth Kumar, S/o Malleswara Rao, Hindu, age 35 years, working in Cinema Industry as Cinema Autographer, R/o Barjupadu Village, Polaki Mandal, Srikakulam Dist.

పిటీషనర్ పై నంబరు కేసు మీ పై విడాకులు కోరుతూ కేసు దాఖలు చేసినారు యిందు మూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు సమను మరియు నోటీసు పంపించిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించి నందున పై కోర్టు వారు Substitute Service మూలంగా యీ పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీచేస్తూ యున్నాము.

కాబట్టి యీ కేసులో రెస్పాండెంట్ అయిన మీరు కోర్టుకు హాజరు నిమిత్తం మహారాజశ్రీ సోంపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో తే 11-07-2023 దీకి కోర్టు వారు వాయిదా వేసియున్నారు. మీరు సదరు తే 11-07-2023 దీన ఉదయం గం॥ 10-30 ని॥ లకు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు తెలియజేయగలరు లేని యెడల మీ పరోక్షంగా తీర్పు చెప్పబడును.

ఇట్లు
మంగి చలపతిరావు
న్యాయవాది, సోంపేట.
సెల్ : 9440550328

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయాలి

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కరరావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే ఫిర్యాదు చేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా పంపిణీ, ఓల్టేజ్ హెచ్చు తగ్గులు, ఇంటికి విద్యుత్ రాకపోయినా, మీటర్ మార్చడం వల్ల ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా వెంటనే సెంటర్ టోల్ ఫ్రీ నంబరు 1912, ఇండోర్ సబ్ స్టేషన్ 8333940729 నంబరుకు కాల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఫిర్యాదు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి దగ్గర నుంచి హాజరయ్యే వారు నిరంతరం 24 గంటలు పాటు పనిచేసే వ్యవస్థ ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. నంబర్లకు ఫోన్ చేసినా సమస్య పరిష్కారం కాకపోతే అసిస్టెంట్ ఇంజినీర్ 8333940724, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 944081 2395 సెల్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ఒక్కోసారి విద్యుత్ పునరుద్ధరణ విషయంలో తలమునకలై ఉంటారని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న అప్పలనాయుడు

మంత్రి 'బొత్స'కు జన్మదిన శుభాకాంక్షలు

లావేరు : రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణకు ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి లుకలాపు అప్పలనాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉమెన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బల్లాడ హేమమాలినిరెడ్డి, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, మాజీ ఎంపిపి బల్లాడ జనార్దనరెడ్డి, పైడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వట్టి సత్యం, గొర్లె రామినాయుడు, శివంగం నాగరాజు, జి.గురునాయుడు ఉన్నారు.

కేక్ కట్ చేస్తున్న పి.ఎం.జె బాబు

ఘనంగా పి.ఎం.జె బాబు జన్మదినం

శ్రీకాకుళం అర్బన్ : టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు జన్మదిన వేడుకలు నగరంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పాల్గొని కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు కలమట వెంకటరమణ, బగ్గు రమణమూర్తి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పాల్గొన్నారు.

ఆందోళనలో రైతన్న

- సకాలంలో అందని సాగునీరు
- కరుణించని వరుణుడు

ప్రజాశక్తి - ఆమదాలవలస

సకాలంలో పంట పొలాలకు సాగునీరు అందక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 12500 ఎకరాల పరిధిలో వరి సాగు అవుతుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కాలువ పోయి విత్తనాలు చెల్లి 25 రోజులు కావస్తున్నా... వర్షం లేక నారు పుట్టక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో నీరు రాక, నారు పుట్టక ఖరీఫ్ కాలంలో వరి పంటకు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆఖరి దశలో అపరాల పంట సమయంలోనూ ఇబ్బందులు తప్పవని రైతులు ఒకింత ఆందోళన చెందుతున్నారు. వరుణుడు మొహం చాటేయడంతో అటు మండలం, ఇటు మున్సిపాలిటీ పరిధిలో వర్షం పడక విత్తనాలు మొలకెత్తక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో వేసిన విత్తనాలు ఎండకు మలమలా మాడిపోయి నారు పుట్టక రైతు కంట కన్నీరు కారుతుంది. వ్యవసాయ ఇరిగేషన్‌శాఖ అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని పలువురు రైతులు కోరుతున్నారు. సాగునీటిశాఖ అధికారులు కాలువ పనులు ఈ సమయంలో చేపట్టడంపై పలువురు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇసుకలపేట, తొగరాం, దిబ్బలపేట, నారిపేట, కలివరం, ముద్దాడపేట, దూసి, తోటాడ తదితర గ్రామాల్లో వర్షం పడక, నీరు లేక నారుమడులు, ఎదలు ఎండిపోతున్నాయి. ఎదలు, నారుమడులను కాపాడుకోవడానికి రైతులు మోటారు ఇంజన్లు పెట్టి నీటిని కడుతున్నారు. ప్రారంభ మొదట్లోనే గంటకు రూ.వంద ఇచ్చి నీటిని కడుతున్నామని ఇసుకలపేటకు చెందిన రైతు తమ్మినేని నర్సింగరావు తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు సతమతమవుతున్నారు. ఇటీవల అక్కడక్కడ వర్షాలు పడుతున్నప్పటికీ రైతులకు అనుకూలమైన వర్షాలు పడకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. 25 రోజుల క్రితం రైతులు విత్తనాలు చల్లినప్పటికీ కొన్ని విత్తనాలు మొలకెత్తి, మరికొన్ని విత్తనాలు మొలకెత్తక, నీరు అందుబాటులో లేకపోవడంతో పైరు ఎండిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో జూన్ నెలాఖరు నాటికి నారాయణపురం ఎడమ కాలువ ద్వారా సాగునీటిని విడిచి పెట్టేవారు. కానీ, ఈ సంవత్సరం ఇప్పటి వరకు సాగునీరు విడిచి పెట్టకపోవడం, అటు వర్షం లేక, ఇటు కాలువల ద్వారా సాగునీరు రాక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎగువ ప్రాంతాల్లో వరి ఎదలు, దిగువ ప్రాంతాల్లో వరి విత్తనాలు రైతులు చల్లారు. ఆదివారం నాటి ఎండ వేసవిని తలపించింది ప్రకృతి రైతులపై పగబట్టి కన్నెర్ర చేసిందని మండలంలోని పలు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సాగునీరును సకాలంలో అందించి రైతులను ఆదుకోవాలని మండలంలోని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఇసకలపేటలో పొలానికి నీరు కడుతున్న రైతు నర్సింగరావు

సాగునీరు అందించాలి

పొలాల్లో వరి విత్తనాలు చల్లి నేటికి 25 రోజులు కావస్తుంది. జూలై రెండో వారం అవుతున్నా కాలువల ద్వారా సాగునీటిని విడిచి పెట్టలేదు. మరో వైపు వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నాం. విత్తనాలు చల్లి చాలా రోజులు అవుతుంది. అవి మొలకెత్తవేమోనని ఉద్దేశంతో మోటారు ఇంజన్ పెట్టి నీటిని కడుతున్నాం. మోటార్ ఇంజన్ పెట్టి ఎదలకు నీరు అందిస్తున్నా... గంటలకొద్దీ కలవడం లేదు. దీంతో ఆర్థికభారం అధికమవుతుంది. అధికారులు స్పందించి సాగునీటిని అందించాలి.

- అన్నెపు జగన్నాథం, ఇసకలపేట

రోడ్డుకు అడ్డంగా విరిగిన చెట్టు కొమ్మ

తప్పిన ప్రమాదం

వజ్రపుకొత్తూరు: భారీ మర్రిచెట్టు కొమ్మ విద్యుత్ తీగలపై విరిగిపడటంతో మూడు కరెంటు స్తంభాలు నేలమట్టమయ్యాయి. ఆ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. మండలంలోని పల్లిసారథిలోకి వెళ్లే రహదారికి ఆనుకుని ఉన్న భారీ మర్రిచెట్టు కొమ్మ పుటుకుపోయి ఆదివారం ఉదయం విరిగి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడింది. దీంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగి రహదారిపై పడ్డాయి. దీంతో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, విద్యుత్ సిబ్బంది చెట్ల కొమ్మను తొలగించి విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేశారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజు

200 మందికి వైద్య పరీక్షలు

ఆమదాలవలస : మండలంలోని కలివరంలో శ్రీకాకుళం నగరానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్‌రైజ్ డ్యూటీ డాక్టర్ రాజు 200 మంది రోగులకు బిపి, సుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కళాకారులు

కళాకారులను ఆదుకోవాలి

ఆమదాలవలస : కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి బాగాది వెంకటరావు కోరారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో అధ్యక్షుడు టేకి త్రినాథరావు ఆధ్వర్యాన కళాకారుల సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన పేద కళాకారులకు పింఛను ఇవ్వాలని కోరారు. ఆ సంఘ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు మాట్లాడుతూ కళాకారుల కార్యక్రమాల నిర్వహణకు ఆడిటోరియాన్ని నిర్మించాలని ప్రభుత్వానికి కోరారు. అనంతరం కోశాధికారి కొంచాడ రామారావు ఆర్థిక నివేదికను సభ ముందు ఉంచారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు బంకుపల్లి శ్రీరామచంద్ర మూర్తిశర్మ, దాస్యం లక్ష్మణరావు, నైనపాత్రుని చంద్రశేఖరరావు, జి.జోగారావు, సిహెచ్.ఆదినారాయణ, బగాది శ్రీనివాసరావు, జి.నీలకంఠ, ఎం.ఈశ్వరరావు, పి.రాజులు, ఆరజంగి రామాచార్యులు పాల్గొన్నారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ

ఆమదాలవలస : మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులు పక్కాగా రికార్డుల నిర్వహణ ఉండాలని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని స్వయంశక్తి సంఘాల పనితీరు ఆధారంగా, వచ్చిన గ్రేడింగ్‌ను పరిశీలించే నిమిత్తం దూసిపేటలో సంఘాల రికార్డుల నిర్వహణను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంఘంలో సభ్యుల సొంత నిధులు నిరుపయోగంగా ఉండడాన్ని పరిశీలించి పొదుపు నుంచి సంఘ సభ్యులు అవసరమేరకు అప్పులు ఇచ్చుకొని తిరిగి రూపాయి వడ్డీతో తమ సంఘానికి జమ చేసుకోవాలని తెలిపారు. క్లస్టర్ కో-ఆర్డినేటర్ చంద్రరావు, విఒఎ సునీత పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

వైసిపి హయాంలో వ్యవస్థలు నిర్వీర్యం

టిడిపి ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి - పలాస

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేసిందని, రాష్ట్రం బాగు పడాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అందుకు రజక కులస్తులు టిడిపి పార్టీకి అండగా ఉండాలని టిడిపి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అన్నారు. పలాస టిడిపి కార్యాలయం ఆవరణలో ఆదివారం టిడిపి ఆధ్వర్యాన రజక సాధికారిత ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రజకుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. టిడిపి హయాంలో రజకులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులతో పాటు 500 మంది రజకులకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో వివిధ పదవులు ఇచ్చి ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది టిడిపి ప్రభుత్వమేనని అన్నారు. ఈ సమావేశాన్ని అధికార పార్టీ నాయకులు అడ్డుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారని, సమావేశానికి వెళ్తే పథకాలు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. ఇటువంటి బెదిరింపులకు భయపడాల్సిన పనిలేదన్నారు. అనంతరం రామారావు, శిరీషలకు రజకుల సంఘం నాయకులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. రాష్ట్ర కన్వీనర్ గుర్రావుశీల రామకృష్ణ, రాజమండ్రి నారాయణరావు, సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షులు కొవ్వూరు సురేష్, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పాడ పాండు రంగారావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్ రావు, పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు, మనోజ్ కుమార్, బాబూరావు, శంకరరావు, లక్ష్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఏం చేశారని రైతు పండగ

మాజీ మంత్రి అప్పల సూర్యనారాయణ

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి గడచిన నాలుగేళ్ల కాలంలో రైతులకు ఏం మేలు చేశారని పండగ చేసుకుంటున్నారని, రైతులకు ఇచ్చే పరిహారం కంటే పండగ ఖర్చు అధికమవుతుందని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ విమర్శించారు. నగరంలోని అరసవల్లిలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పేదల ప్రభుత్వం కావాలా? పెత్తందారుల ప్రభుత్వం కావాలా? అని జగన్ మాట్లాడడం వెనక మరోసారి ప్రజలను మోసం చేయాలన్న వ్యూహం కనిపిస్తోందన్నారు. అవినీతి, భూకబ్జాలు, ఇసుక దోపిడి, మద్యం దోపిడితో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నందుకు తిరిగి ప్రజలు పట్టం కట్టాలా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తిస్తే ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతులను సన్నద్ధం చేస్తూ సాగునీరు పూర్తి స్థాయిలో అందించేందుకు కాలువల మరమ్మతులకు నిధులు ఇచ్చే వారన్నారు. చివరకు ఉపాధి నిధులను సైతం దారిమళ్లిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి మాత్రమేనని విమర్శించారు. ఇప్పటికైనా రైతుల ప్రయోజనాలు కాపాడలని డిమాండ్ చేశారు.

లావేరు : మండలంలోని గుమ్మాడం పంచాయతీ నాగంపాలెంకు చెందిన మృతుని కుటుంబానికి టిడిపి యువ నాయకులు మజ్జి రామ్మూర్తి చేయూతనిచ్చి ఆదుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన మీసాల రామస్వామి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామ్మూర్తి ఆదివారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో గొర్లె పెద్దరామస్వామి, చిన్న రామస్వామి, కెళ్ల గోపాల్, మజ్జి చంద్రమౌళి, జగ్గూరోతు శ్రీరాములు పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని మోదుగువలసకు చెందిన నీమ్మక అర్జున్ పక్షవాతంతో బాధపడుతున్నాడు. విషయాన్ని తెలుసుకున్న అమ్మా హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ సాగర్, దుర్గారావు, వాసు, శరత్, విజయ్ పాల్గొన్నారు.

లావేరు : ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీరామ్మూర్తి

పలువురికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: మండలంలోని చినవంకకు చెందిన కంసు ఇంద్రావతి ఇటీవల అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఆమెతో చదువుకున్న 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆర్థిక సాయం అందించడానికి ముందుకొచ్చారు. ఆదివారం ఆమెను స్వగృహంలో కలిసి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుకున్నారు. అనంతరం రూ.30 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, బాలు, తులసీరావు పాల్గొన్నారు. అలాగే పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు ఆదివారం కోటబొమ్మాళి మండలం తర్లిపేట పంచాయతీ చలమయ్యపేట కాలనీకి చెందిన జుత్తు సూర్యనారాయణ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సూర్యనారాయణ, అంజలి దంపతులకు పుట్టిన దేవాన్ష్‌కి మలవిసర్జన జరగక కడుపు పొంగిపోయి ఏడాదిన్నర వయసుకే కేన్సర్ వ్యాధితో ఇటీవల మృతి చెందాడు. పేదరికంలో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవడానికి యువతరం సేవా సంస్థ ముందుకొచ్చింది. కార్యక్రమంలో అధ్యక్షులు చింత మురళి, ఇన్‌ఛార్జి గాడి అఖిల్, జ్యోతి సభ్యులు గోరకల శరత్, అన్నెపు లక్ష్మణ్ పాల్గొన్నారు.

టెక్కలి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళికి చెందిన తర్లాన వేణు వేణు ఇటీవల ప్రమాదానికి గురై మంచం పట్టాడు. విషయం తెలుసుకున్న కొత్తపేటకు చెందిన హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యులు వేణుకు రూ.8 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు కంబాల అప్పలరాజు, దాసరి కిట్టు, జీరు రామకృష్ణ, రాజు, సంతు పాల్గొన్నారు.

రేపు ప్రజావేదిక

కోటబొమ్మాళి: స్థానిక మండల ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నామని క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి మార్చి 31, 2023 వరకు ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ బృందం ఇప్పటికే తనిఖీలు నిర్వహించిందని అన్నారు. ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజావేదికలో చర్చిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నాయకులు, కూలీలు పాల్గొవాలన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న తాగునీటి పైపులైన్ మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీరు వృథాగా పోతుంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ పైపులను మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో సోమవారం మున్సిపాలిటీకి తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి యథావిధిగా తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.

పాడైన పైపులైన్

టిడిపి హయాంలోనే మహిళలకు పెద్దపీట

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

టిడిపి హయాంలోనే మహిళలకు మాజీ సిఎం చంద్రబాబునాయుడు పెద్దపేట వేశారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష అన్నారు. మండలంలోని ఉద్దానం గోపినాథపురంలో ఆదివారం నిర్వహించిన టిడిపి మహిళా శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అడపిల్లకు ఆస్తిలో సమాన హక్కు కలిగించింది టిడిపి అని అన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి మహిళా అభివృద్ధికి కృషి చేశామన్నారు. పూండి, గోపినాథపురం, గుణాలపాడు, దేవునాల్తాడ గ్రామాలకు చెందిన మహిళలు నాలుగేళ్లలో తాము పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి తీసుకొచ్చారని, మహిళలకు అండగా ఉంటామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరాడ మెహనరావు, పి.విఠల్‌రావు, కె.రమణ, పుచ్చ ఈశ్వరరావు, మాజీ ఎంపిపి వసంత స్వామి, గోవింద పాపారావు, సాంబమూర్తి, శోభారాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శిరీష

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లాలోని ఫొటోగ్రాఫర్లు ప్రపంచ స్థాయికి ఎదగాలని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో ఫొటో ట్రేడ్ ఎక్స్‌ఫో కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శనలో ఉంచిన ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులను తిలకించారు. కార్యక్రమంలో సినిమా ఫొటోగ్రాఫర్ ఛోటా కె.నాయుడు, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ఫొటో వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్ట నాగరాజు, నగర ఫొటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘ అధ్యక్షులు పక్కి వేణుగోపాలరావు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగరాజు

అధ్వానంగా రహదారులు

ప్రజాశక్తి - నరసన్నపేట

మండలంలో చిక్కాలవలస పంచాయతీ మామిడివలస, కుద్దాం గ్రామాలకు చెందిన రహదారులు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. ఈ గ్రామాల్లో వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వందలాది వాహనాలు రోజూ రాకపోకలు సాగుతున్నాయి. ఈ రోడ్డు అడుగో గొయ్యి ఏర్పడడంతో చిన్న చినుకులు పడినా బురదమయమే. ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఏ చిన్న అవసరమైనా కాలి నడకన వెళ్లాల్సిందే. ఈ మూడు గ్రామాలకు అనుసరించి రింగు రోడ్డు వేయడానికి గత ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో షరామామూలే అయ్యిందని గ్రామస్తులు ముంజి తులసీరావు, సాసుపల్లి రాము, బారకల అప్పన్న, శీర గంగులు వాపోతున్నారు. ఈ విషయంపై సర్పంచ్ ముంజి శ్రీరాములు వద్ద ప్రస్తావించగా గ్రామస్తులు తెలిపేది వాస్తవమేనని అన్నారు. రహదారి అధ్వానంగా ఉండడంతో పంచాయతీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

అధ్వానంగా ఉన్న రహదారి

జనసేన సిద్ధాంతాలను వివరిస్తున్న కిరణ్

జనసేన నాయకుల పర్యటన

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ అన్నారు. మండలంలోని చిట్టెవలస పంచాయతీ చవితిపేటలో ఆదివారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి జనసేన సిద్ధాంతాలను, షణ్ముఖ వ్యూహం వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. గ్రామాల్లో నిర్వహించనున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నందిగాం మండల అధ్యక్షుడు తడేలా చిరంజీవి, టెక్కలి నియోజకవర్గ నాయకులు అట్టాడ శ్రీధర్, ఇలపండ రమేష్, పేడాడ త్రివేణి, లింగూడు కుమార స్వామి, బుడ్డా గవరయ్య, ఆబోతు వెంకటరమణ, బాలరాజు, గద్దాయి భాస్కర్, గురయ్య, గణపతి, కౌశిక్, కూర్మాపు శ్రీను, రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కొత్తూరు: మండలంలోని బమ్మిడికి చెందిన మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి రామకృష్ణ కుమార్తె ఉదిత ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 147వ ర్యాంకు, 99.37 శాతం మార్కులు సాధించింది. అలాగే రోణంకి రాజారావు కుమారుడు భానుప్రకాష్ జవహర్ నవోదయ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. వీరికి విద్యావేత్త సిరిపురపు తేజేశ్వరరావు ఆదివారం వారి వారి గృహాలకు వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువలు కప్పి సన్మానించారు. అలాగే మదనాపురానికి చెందిన గెల్లంకి గోపాల్ తన ఎడ్ల బండిపై ఇసుక తేవడానికి వెళ్లి పిడుగు పాటుతో మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట సర్పంచ్ కె.వెంకటరమణయ్య, గెల్లంకి ఉపేంద్ర, జనార్ధన, మన్మథ, శ్రీవాని, కె.లోకనాథం, వి.సూర్యనారాయణ, శ్రీను, జి.రామారావు, విశ్రాంత ఎంఇఒ బి.శ్రీనివాసరావు కె.క్రాంతికుమార్ ఉన్నారు.


విద్యార్థినిని సన్మానిస్తున్న తేజేశ్వరరావు

యువకుడు ఆత్మహత్య

లావేరు : మండలంలోని అదపాకకు చెందిన ముగడ అప్పలనాయుడు (33) శనివారం అర్ధరాత్రి తన ఇంటిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అప్పలనాయుడు భవన నిర్మాణ కార్మికుడిగా పనిస్తున్నాడు. పని ముగించుకుని రోజూ మద్యం తాగి ఇంట్లోని భార్యతో గొడవ పడుతుండేవాడు. అదేవిధంగా శనివారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి రావడంతో భార్యాభర్తలు ఘర్షణ పడ్డాడు. అనంతరం భార్య మంగమ్మ వేరే గదిలో వెళ్లి పడుకుంది. అర్ధరాత్రి వంట గదిలో శ్లాబ్ ఉక్కుకు తను కట్టుకున్న లుంగీతో ఉరివేసుకున్నాడు. ఆ సమయంలో శబ్దం రావడంతో భార్య వచ్చి చూసేసరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే గ్రామస్తుల సహకారంతో కిందకు దించి 108లో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృత్యువాత పడ్డాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను ప్రవేశపెట్టిన డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి

ఇద్దరు అరెస్టు

కంచిలి: మండల కేంద్రం కంచిలి జెఎంజె పాఠశాల సమీపంలో గతేడాది అక్టోబరు 12న అదే గ్రామానికి చెందిన సాహుకారి వసంత మెడలో నుంచి పుస్తెలతాడు దొంగలించిన కేసులో ఇద్దరు నిందితులను ఆదివారం అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కంచిలి పోలీస్ స్టేషన్లలో నిందితులను విలేకరుల ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసంత తమ పిల్లలను పాఠశాలకు దిగబెట్టి వస్తుండగా ఆమె మెడలోనిపుస్తెలతాడు చోరీ చేసి బైక్‌పై పరారైనట్లు తెలిపాటు. అప్పట్లో సిబ్బంది కేసు నమోదు దర్యాప్తులో భాగంగా చేసి సిసి కెమెరాల ఫుటేజ్, ఇతర ఇతర ఆధారాలను సేకరించారని అన్నారు. ఒడిశాకు చెందిన నిందితులు గణేష్ దాస్, శంకర్ పాత్రలను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి పుస్తెలతాడుతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేసిన స్టేషన్ సిబ్బంది కె.ఈశ్వరరావు, ఎన్.చంద్రయ్య, ప్రసాద్, భుజంగరావు, మాధవరావులకు డిఎస్‌పి రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో సోంపేట సిఐ రవిప్రసాద్, కంచిలి ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ముగ్గురిపై కేసు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని తర్లిబొడ్డపాడుకు చెందిన పూతి అచ్చెన్నమ్మ, పూతి రామారావు, లక్ష్మణరావులపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ ఆదివారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన గేదెల సరస్వతి ఆడపడుచు పూతి అచ్చెన్నమ్మ ఇంటికి ఓ భూమి వివాద విషయమై ప్రశ్నించేందుకు వెళ్లిందన్నారు. అక్కడ మాటామాట పెరిగి ఘర్షణ జరగగా అకస్మికంగా తన అడపడుచు అచ్చెన్నమ్మ ఆమె కుమారులు రామారావు, లక్ష్మణరావులు తనపై దాడిచేసి గాయపరిచారని సరస్వతి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. దీంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తల్లీ కుమార్తె అదృశ్యం

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నసానకు చెందిన మొదిలి కవిత, తన ఎనిమిదేళ్ల కుమార్తె దీపిక అదృశ్యమైనట్లు భర్త పాపయ్య పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. భర్త, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కవిత తన కుమార్తె దీపికను తీసుకొని ఈ నెల 5న కన్నవారైన సంతబొమ్మాళి మండలం మర్రిపాడు వెళ్లారు. మూడు రోజులవుతున్న తిరిగి ఇంటికి రాకపోవడంతో అత్తవారి ఇంటికి వెళ్లి అడిగాడు. ఇక్కడకు రాలేదని అత్తామామలు చెప్పారు. అనంతరం సమీప బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. పాపయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రివి నియంతృత్వ పోకడలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తోటి మత్స్యకారులపై అక్రమ కేసులు బనాయించి వారిని అణచివేసి భయభ్రాంతులకు గురిచేసే తన వైపు తిప్పుకోవాలని మంత్రి అప్పలరాజు చేస్తున్న నియంతృత్వ పోకడలకు స్వస్తి పలకాలని టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు అన్నారు. వజ్రపుకొత్తూరులో టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సాటి మత్స్యకారుడని అప్పలరాజును ఓట్లు వేసి గెలిపిస్తే... ఆయన మత్స్యకారులకు చేసింది ఏమిటని ప్రశ్నించారు. 70 ఏళ్లుగా రాజకీయ పలుకుబడి ఉన్న మంచినీళ్ల పేట మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు కుటుంబంపై మంత్రి రాజకీయ కక్షతో అక్రమ కేసులు బనాయించి రౌడీషీటర్ తెరవడం అన్యాయమని అన్నారు. విదేశాల్లో వలస కూలీలుగా పనిచేస్తున్న చిన్నారావు తమ్ముళ్ళ శేఖర్, వల్లభరావుపైనా రౌడీషీటర్ తెరవడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. చిన్నారావు తండ్రి

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

నారాయణస్వామి నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా, ఎంపిటిసిగా పనిచేశారని గుర్తు చేశారు. 2021లో జరిగిన సర్పంచ్ ఎన్నికలు బహిష్కరించి నిరసన తెలిపినందుకు టిడిపి నాయకులపై అక్రమ కేసు బనాయించారని అన్నారు. సమావేశంలో మత్స్యకార నాయకులు, మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, పెంటయ్య, ఎంపిటిసి మాజీ సభ్యులు రామన్న, టిడిపి నాయకులు ఉమామహేశ్వరరావు, బాలకృష్ణ, భాస్కరరావు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

ప్రజాశక్తి- పోలాకి

సత్యనారాయణ ఎస్ఐ

మండలంలో నలుమూలలా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వి.సత్యనారాయణ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోలో క్రైమ్ రేటు తగ్గించి ప్రశాంతంగా ఉండేటట్లు కృషి చేస్తున్నామని అన్నారు. వీటికి ప్రజలూ సహకరించాలని కోరారు. గత నెలలో ఓపెన్ డ్రింకింగ్, ఓవర్ లోడ్‌పై 25 కేసులు, డ్రంక్ ఎండ్ డ్రైవ్ మరో 14 కేసులు నమోదు చేశామని తెలిపారు. మహిళలపై ఎటువంటి దాడులు జరగకుండా ఉమెన్ సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేసినట్లయితే బండి సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం సేవించి వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవు అని అన్నారు. ప్రతి వాహనానికీ సంబంధిత ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మండలంలోని ఈదులవలస, పిర్యాగహారం, పిన్నింటిపేట కూడలిల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎఎస్ఐ, హెచ్‌సిలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

పెన్షన్లు జమ చేయాలి

టెక్కలి రూరల్ : గ్రంథాలయశాఖ పెన్షనుదారులకు పెన్షన్లు జమ చేయాలని గ్రంథాలయ సంస్థ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తమిరి వైకుంఠరావు ఒక ప్రకటనలో కోరారు. పెన్షనుదారులకు ఆరోగ్య పరిస్థితులకు, మందులకు, రేషన్‌కు, ఇంటి అద్దెలకు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పెన్షన్లు అందజేయాలని కోరారు.

పాల్గొన్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

రణస్థలం: రణస్థలం శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి మాట్లాడుతూ చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగా వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విద్యార్థులతో కథలు, దేశ పోరాట యోధుల జీవిత చరిత్రలు, పొడుపు కథలు చదివించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఆర్.ధర్మారావు తెలివి తేటలు, అబద్ధం వల్ల జరిగే ప్రమాదాలు, మనం రోజు తినే ఆహారంలో విటమిన్స్ గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రేపు వీరఘట్టంలో జగనన్న సురక్ష

వీరఘట్టం : మండల కేంద్రంలోని మూడో సచివాలయం పరిధిలో గల కత్తులకవిటిలో ఈనెల 11న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.జయంతి ప్రసాదు ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులంతా ఉదయం 10 గంటలకే సమయం పాటించి విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నందిగాంలో పారిశుధ్య పనులు

నందిగాం : స్థానిక శ్మశాన వాటికలో పారిశుధ్య పనులను నందిగాం సర్పంచ్ జె.రమణమ్మ ఆధ్వర్యాన ఆదివారం చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని లక్ష్యంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులను సర్పంచ్ ప్రతినిధి జె.జైరాం పర్యవేక్షణలో చేపడుతున్నారు.

పనులను పరిశీలిస్తున్న జైరాం

విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంఘం అధ్యక్షులుగా విశ్వేశ్వరరావు

నూతనంగా ఎన్నికైన విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంఘం మండల అధ్యక్షులుగా లోలుగు విశ్వేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా కటకం పూర్ణచంద్రరావు, నల్లబాటి రాజశేఖర్, జనరల్ సెక్రటరీగా దుప్పలపూడి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా మండ వెంకట రమణమూర్తి, ట్రెజరర్‌గా కటకం హరిప్రసాద్, అసిస్టెంట్ ట్రెజరర్‌గా టేకి గోపాలకృష్ణ, కన్వీనర్‌గా తాలాబత్తుల ధనుంజయరావు, సహాయ కన్వీనర్‌గా నిమ్మగడ్డ రామనాగ్‌లను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కుప్పిలి చంద్రమౌళి, మండా రాజేశ్వరరావు, ఒమ్మి భాస్కరరావులను ప్రత్యేక సలహాదారుగా బ్రహ్మశ్రీ కటకం నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ యూనియన్‌లో మిగిలిన విశ్వబ్రాహ్మణ ఉద్యోగులనూ చేర్చుకుని బలమైన సంఘంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఇటీవల ఎల్ఎన్‌పేట ఎంఇఒ-2గా ఉద్యోగోన్నతి పొందిన కుప్పిలి చంద్రమౌళిని దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కంచిలి

కంచిలి శివార్లలోని శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు సోంపేట రోటరీక్లబ్ సభ్యులు, కంచిలికి చెందిన కొత్తకోట నాగరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే సీతయ్య ఫౌండేషన్ ఆశ్రమం వద్ద ఉద్దానం మెడికల్ సెంటర్ నిర్మాణానికి సైతం శంకుస్థాపన చేశారు. రాత్రి క్లబ్ ఆర్థిక సహకారంతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు గుల్ల మోహన్, రమేష్‌లు తెలిపారు. రోటరీ క్లబ్ సమాజ సేవా కార్యక్రమాల్లో మరింత భాగస్వామ్యం కావడానికి స్థానిక పంచాయతీలు నాయకుల సహకారంతో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు, రోటరీ నూతన అధ్యక్ష

శంకుస్థాపన చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

కార్యదర్శులు పి.వి.రావు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాస్ రెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు రామారావు మాస్టారు

రామారావును భుజాలపై మోస్తూ ఊరేగిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట

తోటి ఉపాధ్యాయులకు ఆదర్శనీయుడు రామారావు మాస్టారని ఎంఇఒలు ఆనందరావు, సూర్యచంద్రరావు అన్నారు. మండలంలో పూలిపుట్టి పంచాయతీ ఆనపకాయలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అంపిలి రామారావుకు మండ కాలనీలో పాఠశాలకు బదిలీ అయ్యింది. ఈ సందర్భంగా ఆదివారం గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు రామారావు దంపతులను ఘనంగా సన్మానించారు. తొలుత ఆ గ్రామ గిరిజనులు మేళతాళాలతో, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలతో స్వాగతం పలికారు. కాలు కడిగి ఊరంతా భుజంపై కూర్చుని పెట్టి ఊరేగించారు. అనంతరం జరిగిన సభలో ఎంఇఒలు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ప్రజల మన్ననలు ఇంతగా పొందడం గొప్ప విషయమన్నారు. ఉపాధ్యాయుడిగా ఇక్కడ గిరిజనులకు ఐదేళ్లగా అనేక సేవలు అందించారని, అందుకే ఇక్కడ ప్రజలు బ్రహ్మ రథం పట్టారని కొనియాడారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు సన్మానించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు, గౌరవ అధ్యక్షులు హరిక భాస్కర రావు, కార్యదర్శి సింహాచలం, ప్రకాశం, కె.పారయ్య, కాంతారావు, కృష్ణారావు, ఈదుపురం ప్రధానోపాధ్యాయులు బి.రామారావు, పాలకొండ యుటిఎఫ్ మండల కార్యదర్శి పి కాంతారావు పాల్గొన్నారు.

కలుపు నివారణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కలుపు నివారణతో అధిక దిగుబడులను సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు అన్నారు. ఆదివారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వెదజల్లిన సీడ్ డ్రిల్‌తో విత్తినా, అలాగే డ్రమ్ సీడర్‌తో విత్తిన పొలాల్లో కలుపు నివారణకు సిఫార్సు చేయబడిన కలుపు మందులను రైతులు వాడి అధిక పంట దిగుబడులను సాధించవచ్చునని తెలిపారు. ఊదతుంగ, ఆమడకాయ, జొడ, గుంట కలగర, పిల్లి అడుగు వంటి కలుపును నివారించాలని తెలిపారు. అన్ని రకాల కలుపు నివారణకు ప్రిటిలాక్లోర్ మందును ఎకరాకు 400 మిల్లీలీటర్లు వాడాలన్నారు. విత్తిన 48 గంటల లోపు స్ప్రే చేసుకోవాలన్నారు. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలని తెలిపారు. అలాగే పింజి మిథాలిన్ మందును ఎకరాకు ఒక లీటరును వాడాలని, విత్తిన 48 గంటల్లోపు స్ప్రే చేసుకోవాలని తెలిపారు. ఇది కూడా ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. కలుపు మందులు చల్లేటప్పుడు నేలలో తగినంత తేమశాతం ఉండేలా చూసుకోవాలని చెప్పారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1992-94 విద్యా సంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళంలో 75 మంది పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల నుంచి వ్యయప్రయాసల కోర్చి హాజరయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. నాటి మిత్రుల ఆర్థిక స్థితి గతులను తెలుసుకున్న సభ్యులు ఆర్థికంగా వెనకబడిన వారికి తమ వంతు చేయూత నిచ్చేందుకు తీర్మానించారు. విందు, వినోదాలతో రోజంతా గడిపి పూర్వ అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు భూపతి రాజు, విజయ రాఘవ రాజు, మామిడి లక్ష్మణ, తిరుమలరావు, కవిత, శిరీష, ఎస్.శంకర్‌బాబు పాల్గొన్నారు.

జనసేన నాయకుల పరామర్శ

కవిటి : మండలంలోని కపాసుకుద్దిలో ఆదివారం ఉదయం పడవ బోల్తా పడి మృతి చెందిన మత్స్యకారుడు బడే ఢిల్లేష్ కుటుంబాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు పరామర్శించారు. ఢిల్లేష్ భార్య తిరుపతమ్మను ఓదార్చి, ధైర్యం చెప్పారు. పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మత్స్యకార వికాస విభాగ రాష్ట్ర కార్యదర్శి హరి బెహరా, రోకళ్ల భాస్కరరావు, బడే దేవరాజు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు మోపడం సరికాదు

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరికాదని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మండలంలోని పలగారలో ఇంటింటికి వెళ్లి వినియోగదారులకు వచ్చే విద్యుత్ బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారులు మాట్లాడుతూ ఎప్పుడూ లేనంతగా కరెంటు బిల్లులు వచ్చాయని సిపిఎం నాయకులకు చెప్పారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు, సర్‌ఛార్జీ, కస్టమర్ ఛార్జీలు ఇలా అనేక రకాలుగా ప్రజలపై విద్యుత్తు భారాలు వేయడం సరికాదన్నారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యవసర వస్తువు సరుకుల ధరలు విపరీతంగా పెరిగితే ఇప్పుడు ప్రభుత్వం ప్రజలపై ఇలాంటి భారాలు వేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం పెరిగిన బిల్లులతో పలగారలో గ్రామస్తులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు బద్దన భానుమూర్తి, మజ్జి సన్యాసి, అల్లాడి కృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, వినియోగదారులు పాల్గొన్నారు.